# బొమ్మ-బొరుసు



అబ్బూరి ఛాయాదేవి

"అమ్మా, నేను కోల్‌కటా వెడుతున్నానే. ఆయనకి కాన్ఫరెన్స్ ఉందక్కడ" అంది పెద్దకూతురు రమ్య ఫోన్ చేసి. వెంటనే యమున మనస్సులోతుల్లో ఏదో కెలికినట్లయింది. అంతలోనే సర్దుకుని, "ప్రయాణం ఎప్పుడమ్మా రమ్యా?" అంది గొంతులో ఉత్సాహం నింపుకుని.

వచ్చే ఆదివారం అని చెప్పింది రమ్య. భర్త ఒక్కడూ అయితే విమానంలో వెళ్ళి ఉండేవాడు. తను కూడా ఉంటుంది కాబట్టి రైల్లోనే వెడతారుట. రమ్య కోల్‌కటా చూడటం మొదటిసారి. రమ్య చంటిపిల్లగా ఉన్నప్పుడు యమున చిన్నక్క శ్యామల కలకత్తా నుంచి ఒక బొచ్చుకుక్కపిల్ల బొమ్మ తెచ్చి బహుమతిగా ఇచ్చింది. తెల్లగా ముద్దుగా ఉంది ఆ బొచ్చుకుక్కబొమ్మ. కానీ రమ్య దాన్ని ముట్టుకోవడానికి భయపడింది - మెరుస్తున్న దాని నల్లని కళ్ళు చూసి. ఆ విషయం గుర్తు చేస్తే, రమ్య కిలకిలా నవ్వింది. రమ్యకిప్పుడు దాదాపు యాభైఏళ్ళు. ఇంకా చిన్నప్పటిలాగే కిలకిలా నవ్వుతుంది చిన్నవిషయానిక్కూడా.

యమున పెళ్ళయిన కొత్తలో కూడా అలా నవ్వలేకపోయేది. ఎప్పుడూ ఏదో ఒక చేదు అనుభవం అవడం, నవ్వు తనలోనే కూరుకుపోవడం జరిగేది. ఓ కృతకమైన చిరునవ్వుని మాత్రమే పెదవుల మీదికి తెచ్చుకోగలిగేది, యమునకి పదిహేడేళ్ళ వయస్సుకే పెళ్ళయింది. ఇంట్లో ఆఖరిపిల్ల. తండ్రికి షష్టిపూర్తి అయిపోయింది. ఆ పిల్ల పెళ్ళికూడా చేసేస్తే మిగిలిన ముఖ్యమైన బాధ్యత పూర్తయిపోతుందనుకుని తండ్రి తొందరపడ్డాడు. యమున స్కూలు ఫైనలు పూర్తికాగానే చదువు ఆపించేశాడు. శ్యామలకి చెప్పించినట్లు పై చదువులు చెప్పించలేదు. శ్యామలకీ యమునకీ ఏడేళ్ళ తేడా ఉంది. మధ్యలో ఇద్దరు పిల్లలు పోయారు పసితనంలోనే.

యమున చిన్నప్పటినుంచీ తను విన్న పాటలు పాడుతూంటే, తల్లి మురిసిపోయి కర్నాటక సంగీతం చెప్పించింది – గుళ్ళో ఆచార్యులు గారు ఊరికే నేర్పిస్తున్నారని తెలిసి. ఆయన పోయాక ఇంకొక మాస్టరుగారిని కుదిర్చింది ఎరిగున్న వాళ్ళద్వారా. యమున బాగా పాడటం గమనించి, మరింత భావయుక్తంగా పాడాలనీ, పదాల ఉచ్చారణ సరిగ్గా ఉండాలనీ తండ్రి చెప్పేవాడు. చదువులోకన్న సంగీతంలోనే యమునకి ఆసక్తి పెరిగింది.

పెళ్ళిచూపుల్లో యమున పాడిన పాటే పెళ్ళివారిని మురిపించింది, ముఖ్యంగా పెళ్ళికొడుకుని. పెళ్ళికొడుకు ఎం.ఎస్.సిలో గోల్డ్‌మెడలిస్ట్ అని యమున తండ్రి మురిసిపోయాడు. పెళ్ళివారు బేరం పెట్టకపోయినా, కట్నకానుకలకు లోటు చెయ్యనని చెప్పాడు. పెళ్ళికొడుకు పొడుగు, యమున పొట్టి అయినా కొండపల్లి బొమ్మలా ఉందని అందరూ మెచ్చుకున్నారు యమునని పెళ్ళికూతురి ముస్తాబులో చూసి. మనుగుడుపులకి వెళ్ళినప్పుడు అత్తగారు బంధుమిత్రుల్ని భోజనానికి పిలిచి, యమున సంగీతకచేరీ పెట్టించింది. 'పిట్టకొంచెం, కూత ఘనం' అన్నట్లు చిన్నదైనా అద్భుతంగా పాడిందని అందరూ మెచ్చుకున్నారు. కోడలి పాటకు అత్తగారు గర్వపడింది కూడా ఆ సమయంలో.

ఆవిడకి నరసింహమూర్తి ఒక్కడే కొడుకు. కొన్ని కానుపులు పోయాక ఆలస్యంగా దక్కడం వల్ల అతన్ని అపురూపంగా పెంచింది తల్లి. అతని మీద ఈగ వాలినా సహించలేకపోయేది. కొడుకు తిండి విషయంలో అత్యంత శ్రద్ధ తీసుకునేది. యమున పద్దెనిమిదోయేట కాపురానికి వచ్చింది మొదలుకొని వంటింటి బాధ్యతా, ఇంటిపనుల బాధ్యతా యమునకే అప్పగించేసి, అత్తగారి హోదాలో పురమాయింపులూ, అజమాయిషీ మాత్రం చేసేది. భర్తనోట్లో నాలుక లేనట్లుండేవాడు. స్కూలు మాస్టరుగా పనిచేసి రిటైరయాడు. భార్య ఎదుట మాట్లాడటానికి మాత్రం జంకుతున్నట్లు ఉండేవాడు. ఇంట్లో ముగ్గురినీ మూడు రకాలుగా కనిపెట్టుకుని ఉండాల్సి వచ్చేది యమునకి.

యమున పాట విని సంబంధం చేసుకున్నా, తన చేత ఇంట్లో పాడించడానికి నరసింహమూర్తికి సిగ్గూ, మొహమాటం తల్లి ఎదుట. గదిలో రాత్రిపూట ఏం పాడమంటాడు? గట్టిగా మాట్లాడుకోవడానికే వీలుండేది కాదు. గది తలుపు పక్కనే తల్లి మంచం. తమ మాటలు వినబడతాయని ఫేన్‌ని ఫుల్‌గా పెట్టుకుంటే, తెల్లవారేసరికి యమునకి తుమ్ములూ, జలుబూ ! ఏ పేరంటానికో వెళ్ళినప్పుడు పాడటం, ఇంటి పనులు చేసుకుంటూ పాడుకోవటం తప్పించి, ప్రత్యేకంగా సంగీత సాధన చెయ్యడానికి వీలుండేది కాదు. కోడలంటే ఎంత ఆపేక్ష ఉన్నా, కొడుకు పెళ్ళానికి దగ్గరవడం సహించలేకపోయేది. ఆఫీసునుంచి వచ్చాక కొడుకు తన దగ్గరే ఉండాలనుకునేది ఆవిడ. కోడలు నిత్యం ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండేటట్లు చూసేదావిడ.

యమునకి నెల తప్పిందని తెలియగానే, వంశోద్ధారకుణ్ణి కంటుందని మురిసిపోయింది ఆవిడ. కానీ చివరికి ఆడపిల్ల పుట్టిందని విన్నాక ఆవిడ ధోరణి మారిపోయింది. పుట్టింటినుంచి పిల్లని తీసుకు వచ్చినప్పటినుంచీ సూటీ పోటీ మాటలతో వేధించడం మొదలుపెట్టింది. బారసాల వేడుక కూడా జరపలేదు. కూతురికి 'రమ్య' అని యమునే పేరు పెట్టుకుంది. ఆవిడ 'ఏమే' అని పిలిచేవారు మనవరాల్ని. పిల్లని దగ్గరికి తీసుకునేది కాదు. కొడుకుని కూడా ఎత్తుకోనిచ్చేది కాదు ఆవిడ. రెండో కానుపుకైనా మగపిల్లవాడు పుడతాడనుకుంటే మళ్ళీ ఆడపిల్లే పుట్టింది. యమున చాలా బలహీనంగా ఉందని, ఇంక పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ జరిగింది. ఈసారి పిల్లకి తన తల్లిపేరు పెట్టాలన్నాడు నరసింహమూర్తి. ఆ పేరు పెట్టాక అత్తగారి మనస్సు కొంత శాంతించింది. 'రమణి'ని కాస్త ముద్దుచేసి దగ్గరికి తీసుకునేదావిడ. కొడుకు ఎత్తుకున్నా ఏమీ అనేది కాదు.

ఈ పిల్లల పెంపకంతోనూ, అత్తమామల సేవతోనూ యమున ఎప్పుడూ భర్తతో కలిసి పొరుగూరికి ఎక్కడికీ వెళ్ళడం కుదిరేది కాదు. తనకి వెళ్ళాలని సరదాగా ఉండేది. కానీ భర్తతో "నేనూ వస్తా"నని అనడానికి ఆస్కారం ఉండేది కాదు. ఇంటి చాకిరీకే అంకితమైపోయింది. పిల్లల చదువుపట్ల శ్రద్ధ వహించేది. భర్తకి ఎంతసేపూ ఆఫీసుపనులు ముఖ్యం. తిండికీ పడకకీ తప్ప, ఇంటి విషయాలు అంతగా పట్టించుకునేవాడు కాదు. యమున తన చదువు స్కూల్ ఫైనల్‌తో అయిపోయిందని, తన పిల్లలు గ్రాడ్యుయేట్లయినా అవ్వాలని పట్టుదలతో చదివించింది. ఇంకా పై చదువులంటే పై ఊళ్ళకి వెళ్ళాలి. ఇంట్లో ఎవరూ ఒప్పుకోరు, తనకీ మన సొప్పదు. అందుకనే వాళ్ళకి గ్రాడ్యుయేషన్ అవగానే, సంబంధాల కోసం తీవ్రంగా కృషిచేసి, తెలిసిన వాళ్ళందరి దగ్గరా వాకబు చేసి, మొత్తం మీద మంచి సంబంధాలు చేశారు. అప్పటికి అత్తమామలిద్దరూ ఒకరి తరువాత ఒకరు కాలం చేశారు. అయినా, యమున భర్తతో కలిసి ఏ ఊళ్ళైనా వెళ్ళాలనుకున్నా కుదరలేదు. రమ్య కడుపుతో ఉండటం, ఆ పై సూడిదలూ, పురుడు పుణ్యాలూ, మనవరాలి ఆలనా పాలనా – ఇలా కొనసాగింది యమున గృహిణి జీవితం. ఆ తరువాత రెండోపిల్లకి పురుడు పుణ్యాలూ, ఆ తరువాత పెద్దపిల్లకి రెండో కానుపూ – ఇలా సాగింది.

ఇప్పుడు వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బతకడమే కాదు – వాళ్ళ పిల్లల్ని సక్రమంగా పెంచి పెద్ద చేస్తున్నారు. పై ఊళ్ళలో ఉంచి పెద్ద చదువులు చదివిస్తున్నారు. ముఖ్యంగా రమ్య ఇప్పుడు కొంత స్వేచ్ఛగా ఉందనే చెప్పాలి. భర్త ఆఫీసు పనులమీద ఏవైనా మీటింగ్స్‌కి వెళ్ళేటప్పుడు పెద్దపెద్ద నగరాలకి

**యమున పాట విని సంబంధం చేసుకున్నా, తన చేత ఇంట్లో పాడించడానికి నరసింహమూర్తికి సిగ్గూ, మొహమాటం తల్లి ఎదుట. గదిలో రాత్రిపూట ఏం పాడమంటాడు? గట్టిగా మాట్లాడుకోవడానికే వీలుండేది కాదు. గది తలుపు పక్కనే తల్లి మంచం. తమ మాటలు వినబడతాయని ఫేన్‌ని ఫుల్‌గా పెట్టుకుంటే, తెల్లవారేసరికి యమునకి తుమ్ములూ, జలుబూ !**

అతనితోపాటు వెళ్ళడం మొదలుపెట్టింది. రమ్య అత్తవారిది పెద్ద కుటుంబం. అత్తమామల బాధ్యత వీళ్ళపైనఅంతగా లేదు – అప్పుడప్పుడు చుట్టపు చూపుగా రావడం తప్ప. పైగా అతను అందరికన్నా చిన్నవాడు. తల్లిదండ్రులు ఎక్కువగా పెద్దవాళ్ళ దగ్గరే ఉంటూ ఉంటారు.

యమునకీ రమ్యకీ జీవిత విధానంలో, పరిస్థితుల్లో చాలా తేడా ఉంది. కూతురు పి.హెచ్.డి చేస్తున్నా రమ్య ఇంకా యువతిలాగే ఉంటుంది. యమున నలభై ఏళ్ళకే అమ్మమ్మ అయిపోయింది. వద్దన్నా వృద్ధాప్యపు ముద్ర పడుతూ వచ్చింది.

ఇప్పుడు రమ్య ఫోన్ చేసి, భర్తతో కలిసి కోల్‌కటా వెడుతున్నానని ఉత్సాహంగా చెప్పినప్పుడు తక్షణం యమున మనస్సులో కలుక్కుమంది. తన గతమంతా గుర్తుకొచ్చింది. కానీ అంతలోనే తేరుకుంది. తన అదృష్టం తనది అనుకుంది. తను పొందిన అనుభవాలు తనవి. పిల్లల పెళ్ళిళ్ళూ, వాళ్ళు కడుపుతో ఉన్నప్పుడు జరిపిన వేడుకలూ, మనవలతో ముచ్చట్లూ అన్నీ ఉత్సాహంగానే అనిపించేవి. ఆ ఆనందం ముందు శారీరక శ్రమ అంతగా బాధపెట్టేది కాదు. పెట్టినా, పట్టించుకునేది కాదు. నిద్ర సరిపోక పోయినా సరిపెట్టుకునేది. తిరగలిరాయిలా తిరుగుతూ, పప్పులా నలిగిపోతున్నా, అదే అదృష్టం అనుకునేది. కష్టం ఎదురైనప్పుడల్లా దేవుడికి మొక్కుకునేది.

కానీ ఇప్పుడు కూతుళ్ళు అనుభవిస్తున్న స్వేచ్ఛ చూసి, గతంలో తను అది పోగొట్టుకున్నాననో, ఆ స్వేచ్ఛ తనకి లేకుండా పోయిందనో అనిపించి, క్షణికంగా బాధపడుతోంది. పోనీ ఇప్పుడు ఇద్దరూ కలిసి ఊళ్ళు తిరిగి రావచ్చు కదా అంటే, భర్తకి కీళ్ళ నొప్పులూ, తనకి స్పాండిలైటిసూ, బ్రోంఖైటిసూ, ఒకరికి కంటి బాధలూ, ఒకరికి పంటి బాధలూ – ఏదో ఒకటి వెనక్కి లాగి ఇంట్లోంచి బయటపడ కుండా చేస్తోంది. దానికి తోడు ధరలు పెరిగి పోతూండటం. ప్రయాణాలంటే మాటలా! అయినా, ఇప్పుడు తమకేంలోటు! అన్ని బాధ్యతలూ సకాలంలో తీర్చుకున్నారు. ఇప్పుడు వృద్ధాప్యంలో చిలకా గోరింకల్లా ఇంట్లోనే ముచ్చటగా ఉంటున్నారు. తన భక్తిపాటలు తను స్వేచ్ఛగా పాడుకునే వీలుంటోంది కదా అని సర్దిచెప్పుకుంది.

అయితే, తన పరిస్థితిని చూసి రమ్య అసూయలాంటి భావాన్ని వ్యక్తం చేస్తుందని యమున ఊహించలేదు! కోల్‌కటా నుంచి తిరిగి రాగానే రమ్య తల్లిని చూడటానికి వచ్చింది. ఉత్సాహంగా తమ 'టూర్' విశేషాలు చెప్పడానికి వచ్చిందనుకుంది యమున. కాదు. తన బాధలు చెప్పుకోవడానికి వచ్చింది.

కోల్‌కటాలో సమావేశం సందర్భంగా ఒక తెలుగు కుటుంబంతో పరిచయం అయిందిట. వాళ్ళబ్బాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇంకా పెళ్ళికాలేదు. రమ్యకూతురు శ్రావణికి ఆ సంబంధం చాలా బావుంటుందనిపించిందట. శాఖ, గోత్రం, నక్షత్రం, పొడుగూ, వయసూ అన్నీ సరిపోయాయిట. ఉత్సాహంగా కోల్‌కటా నుంచి ఢిల్లీకి ఫోన్ చేసి, శ్రావణికి చెప్పారుట. శ్రావణి వెంటనే మరో మాటకి తావివ్వకుండా, "నేను ఇప్పుడిప్పుడే పెళ్ళి చేసుకోను" అందిట. తను ఈ మధ్యనే ఢిల్లీ యూనివర్శిటీలో చేరి పి.హెచ్.డి చేస్తోంది. అంతకు ముందు కొన్నాళ్ళు రీసెర్చ్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేసింది. అప్పుడే తనకి ఇరవైఎనిమిదేళ్ళు. ఇంకా "ఇప్పుడప్పుడే పెళ్ళి చేసుకోను" అంటుందేమిటని రమ్య బాధ. తండ్రి నచ్చజెప్పినా శ్రావణి వినలేదట. తను స్వయంగా పరిశోధన రీత్యానో, ఉద్యోగ రీత్యానో అమెరికా వెళ్ళాలి గాని, భర్తమీద ఆధారపడి వెళ్ళడం ఇష్టం లేదుట. ఉద్యోగరీత్యా అక్కడ అమెరికాలో ఇబ్బంది లెదురవుతాయిట. తన భవిష్యత్తు చెడిపోతుందని వాదించిందట. తన కూతురు చాలా తెలివైనదీ, చురుకైనదీ అని గర్వపడుతున్నా, తండ్రికి లోలోపల బెంగగానే ఉంది, కూతురుకి త్వరగా పెళ్ళి చేసి జీవితంలో స్థిరపరచలేకపోతున్నామని. రమ్య సరేసరి. కూతరు పెళ్ళి విషయంలో తన మాట వినడం లేదని, ఆ ఉడుకుమోత్తనం అంతా తల్లిమీద చూపించడం మొదలుపెట్టింది.

"మీ కాలంలోనే నయం. హాయిగా చిన్నప్పుడే ఎదిగీ ఎదగని వయస్సులో తల్లిదండ్రులు మీ బాగోగులు ఆలోచించి పెళ్ళి చేసేసేవారు. ఇప్పుడు ఇంత వయస్సొచ్చే వరకూ చదువులూ ఉద్యోగాలూ అంటూ మొండికేస్తున్నారు ఆడపిల్లలు. వాళ్ళకి తగిన వరులు దొరకాలి కదా. ఏ వయస్సులో జరిగే ముచ్చట ఆ వయస్సులో జరిగితే బావుంటుంది అంటే శ్రావణి వినడం లేదు" అంది రమ్య.

"అదేమిటమ్మా రమ్యా, నువ్వెప్పుడూ గింజు కుంటూ ఉండేదానివి కదా – గ్రాడ్యుయేషన్ అయి పోగానే హడావిడి పడిపోయి నీకు పెళ్ళి చేసేశామనీ, నిన్ను పై చదువులకి వెళ్ళనివ్వలేదనీ మమ్మల్ని సాధించేదానివి కదా. ఇరవై రెండేళ్ళు దాటకుండానే తల్లివైపోయావనీ, పై చదువూ, ఉద్యోగం కలలుగానే మిగిలిపోయాయనీ బాధపడు తూండే దానివి కదా. నువ్వు నాకన్నా నయమే కదా – స్కూల్ ఫైనల్‌తో చదువు ఆగిపోయి, నేను పద్దెనిమిదేళ్ళకే ఇంటిపనుల్లో కూరుకుపోయాను" అంది యమున.

"చదువులకీ ఉద్యోగాలకీ అంతేముంది? జీవితమంతా ముందుంది. పెళ్ళయ్యాక చదువుకో కూడదా? మీ శ్యామలక్కయ్య అలాగే పెళ్ళయ్యాక చదువు కొనసాగించి పైకి రాలేదా?" అంది రమ్య.

"సరేలే, అందరికీ ఆ అవకాశాలు కలిసి రావద్దా? అత్తవారింట్లో అనుకూలంగా ఉండొద్దా? నిజమే, శ్రావణికి పెళ్ళివయస్సు మీరుతోందనిపిస్తోంది – మన కాలంతో పోల్చుకుంటే. కానీ ఈ రోజుల్లో ఆడపిల్లలు చాలామంది అలాగే తమ ఆకాంక్షల్ని తీర్చుకోవాలని ఆరాటపడుతున్నారు. రోజులు మారాయి మరి!" అని యమున సర్ది చెప్పబోయింది – తను రమ్యకన్న పాతతరం మనిషే అయినా.

అప్పుడు రమ్య ఇలా అంది – "కబుర్లు చెప్పడానికేం! హాయిగా కూతుళ్ళిద్దరికీ పెందరాళే పెళ్ళిళ్ళు చేసేసి, మనవల ముచ్చట్లు కూడా అనుభవించి, ఇప్పుడు హాయిగా నిశ్చింతగా ఉన్నారు మీరిద్దరూ. మాకు బాధ్యతలన్నీ ఇంకా ముందు ఉన్నాయి. అప్పుడే ఓపికలు తగ్గిపోతున్నాయి. హై బి.పి, నడుంనొప్పి పట్టుకున్నాయి. ఇంకో అయి దారేళ్ళు పోయాక మనవల పురుళ్ళూ పుణ్యాలు చూసుకోవాలంటే ఎంత కష్టం!"

యమున తెల్లబోయింది. తమ తల్లీ కూతు ళ్ళిద్దరిలో ఎవరు ఎక్కువ సుఖంగా ఉన్నట్లు?! ఇన్నాళ్ళూ తన జీవితంలో 'బొరుసు' వచ్చిందని యమున బాధపడుతూంటే, దాన్నే 'బొమ్మ' అంటోంది రమ్య.

ఎవరిది 'బొమ్మో', ఎవరిది 'బొరుసో' తెలియక అయోమయంగా చూసింది రమ్యకేసి. రమ్య ముఖం గంటు పెట్టుకుని కూర్చుంది. ఇన్నాళ్ళూ తన జీవితం కొంతవరకు వ్యర్థం అయిందని బాధ పడటం ఎంత తెలివి తక్కువ తనమో అనిపించింది యమునకి. అసలు ఎలాంటి పరిస్థితుల్లో అయినా, సమస్యల్ని అర్థం చేసుకుని, ఉన్నవాటితో తృప్తి చెందడంలోనే ఆనందం ఉంటుందని తెలిసొచ్చింది యమునకి. "రమ్య ఎప్పుడు తెలుసుకుంటుందో!" అనుకుంది.

**సినీతారల ఫోటోలు**

ఈ క్రింది అడ్రస్‌కు రూ. 20/–లు ఎం.ఓ చేయండి. వెంటనే మీ అభిమాన సినీతార కలర్ కార్డుసైజు ఫోటోతో పాటు మిమ్మునవ్వించే జోకుల పుస్తకం కూడా పొందండి.

వై.కె.మూర్తి
దాసరివారి వీధి, సూర్యారావుపేట,
విజయవాడ - 520 002